# పెన్నహోబిళంలో కన్నుల పండువగా శ్రీవారి ప్రాకారోత్సవం

**- పాల్గొన్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవమ్మ**

ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త



శ్రీవారి ప్రాకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవమ్మ

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం అశ్వీయుజ త్రయోదశి శనివారం సాయంత్రం శ్రీవారి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చిన ప్రధానాలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించగా ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవమ్మ పాల్గొన్నారు. అంతకు ముందు ప్రధానాలయంలో ఆమె లక్ష్మినరసింహస్వామిను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండవ శనివారం సెలవురోజుకావడంతో ప్రాకారోత్సవంలో జిల్లానలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నా రు. ఆలయ పరిసరాల గుండా కాలువలో పారుతున్న నీటి జలపాతాలవద్ద ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సహకరించండి

**-ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మెన్ పయ్యావుల కేశవ్‌కు విన్నవించిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం**

ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త



పీఏసీ ఛైర్మెన్ పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీయుఎస్ నాయకులు

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి సహకరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఉరవకొండ ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మెన్ పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందించింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రం అనంతపురంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లిన సందర్భంగా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా అధ్యక్షులు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, ఉపాధ్యక్షులు హర్షవర్ధన్, రమేష్ తదితరులు మాట్లాడుతూ సీపీఎస్ విధానానికి మరో ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ విధానం అమలుకు సంబంధించిన జీఓ నంబర్ 116ను ఈ ఏడాది అక్టోబర్ 24 విడుదల చేసిందని అయితే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర సమయంలో పాత పెన్షన్ అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు కనుక జీఓను ఉపసంహరించుకొని పాత పెన్షన్ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 పేరుతో 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం 2022 మే 10వ తేదీన ఉత్తర్వులు 117 విడుదల చేసిందని ఆ ఉత్తర్వులవల్ల ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి అసంబద్ధంగా ఉన్నందున ఉపాధ్యాయుపై పెనుభారం పడిందన్నారు. కొన్ని ఉన్నత పాఠశాలలు గ్రేడ్-2 హెచ్‌ఎం, పీడీ పోస్టులు కోల్పోయాయని వెంటనే 117 ఉత్తర్వులు రద్దు చేసి గతంలోవున్న ప్రభుత్వ ఉత్తర్వులు 53ను అనుసరించి ఉపాధ్యాయుల క్యాడర్ బలోపేతం చేయాలని కోరారు. ప్రతి ఉన్నత పాఠశాలకు గ్రేడ్-2 హెచ్‌ఎం, పీడీ పోస్టులు చూపాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావలసిన ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్‌ఐ, సంపాదిత సెలవులు, ఇతర ఆర్థిక బకాయిలను సెప్టెంబర్ 30లోపు పూర్తిగా చెల్లిస్తామని, పీఆర్‌సీ, పీప బకాయిలు అక్టోబర్ 31లోపు చెల్లిస్తామని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో మంత్రివర్గ ఉప సంఘం, ఉన్నతాధికారులు స్పష్టమైన హామీ ఇచ్చారని ఇప్పటివరకు చెల్లించలేదని నాయకులు వాపోయారు.

# ఉరగాద్రి బాలోత్సవంలో యునిటీ ఆఫ్ దివాళి నాటిక

**-3వ భాగం పోటీల్లో పాల్గొన్న 300 మంది విద్యార్థులు**

ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త



భరతమాత వేషధారణలోవున్న చిన్నారివద్ద వివిధ మతాలు ప్రతిబింబించేలా ప్రార్థిస్తున్న దృశ్యం



యునిటీ ఆఫ్ దివాళి కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉరగాద్రి బాలోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 3వ భాగంలో గానం, నృత్యం, నాటిక, మెమరీ టెస్ట్ పోటీలు కొనసాగా యి. ఈ కార్యక్రమానికి ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి సురేంద్ర ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. దీపావళి పండుగను పురస్కరించుకొని చిన్నారులు, వివిధ మతాలు సాంప్రదాయ వస్త్రధారణతో హాజరై యునిటీ ఆఫ్ దివాళి నాటికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్ మాట్లాడుతూ మూడు విభాగాలుగా జరిగిన పోటీల్లో ఉరవకొండ, చుట్టుప్రక్కల గ్రామాల నుండి 300 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇందులో గెలుపొందిన 36 మంది విజేతలకు 14న ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీరన్న, ఫౌండేషన్ సభ్యులు నిర్మల, శైలజ, చాందిని, స్వాతి, చంద్రశేఖర్, ఓబులేష్, శ్రీనివాసులు, వేణుగోపాల్, నూర్, చిరంజీవి, రామకృష్ణ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త శోభను సంతరించుకున్న మండల పరిషత్ కార్యాలయం

ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త



మండల పరిషత్ కార్యాలయం కొత్త శోభ ను సంతరించుకుంది. ఈనెల 16వ తేదీన నూతన ఎంపీపీ ఎన్నిక జరుగనుండటంతో కార్యాలయానికి కొత్తగా రంగులు వేయించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయం లో కార్యాలయానికి రంగులు వేయగా ఆ తరువాత కార్యాలయం పైకప్పు పెచ్చులూడి పడుతూ శిధిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయానికి రంగుల వేయించడం, మరమ్మతులపై ఎవరూ దృష్టిపెట్టలేదు. నూతన కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరుకై జిల్లా పరిషత్‌కు ప్రతిపాదనలు పంపారు. అయితే ఎంపీపీగా ఉన్న చందా చంద్రమ్మ తన పదవికి రాజీనామా చేయడంతో ఈనెల 16న నూతన ఎంపీపీ ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో గత నాలుగు రోజులుగా హడావుడిగా కార్యాలయానికి రంగులు వేయించడంతో కొత్త శోభను సంతరించుకుంది.

# నిబంధనలకు విరుద్దంగా టపాసుల విక్రయాలు

**- అనుమతులు ఒక చోట.. అమ్మకాలు మరో చోట**
**- గుట్టూరులో టపాసుల దుకాణం ఏర్పాటు**
**- నిబంధన తుంగలో తొక్కిన టపాసుల విక్రయ దాడులు**
**- రేకులు షెడ్‌లో టపాసులు అమ్మకాలు.. పట్టించుకోని అధికారులు**
**- కన్నెత్తి చూడని అగ్ని మాపక, రెవెన్యూ అధికారులు**

పెనుకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త



శాశ్వత షెడ్డులో టపాసుల దుకాణంలో చిన్న బకెట్‌లో నీళ్లు పెట్టిన దృశ్యం (వృత్తంలో)

దీపావళి పండుగ టపాసుల విక్రయ దారులకు ఆదాయం వచ్చే పండుగ, పండుగ ముందు రోజు నుంచి చిన్న పిల్లలు వృద్ధులంకొని పెద్దవారి వరకు టపాసులు కాల్చుడానికి ఉత్సాహం చూపుతారు. దీన్ని ఆసరాగా చేసుకున్న టపాసుల విక్రయదారులు ధరలకు నియంత్రణ లేకుండా ఇష్టారాజ్యంగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. టపాసుల విక్రయ కేంద్రాల వద్ద నిబంధనలకు పాత్ర వేసి వారికి ఇష్టం వచ్చిన రీతిలో టపాసుల విక్రయాలు సాగిస్తున్నారు. పెనుకొండ మండలం పరిధిలో 7 మందికి టపాసుల విక్రయ అనుమతులు అధికారులు ఇచ్చారు. ఈ విక్రయ కేంద్రాలు మండలం కేంద్రంలో మాత్రమే టపాసులు విక్రయించాలి. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఐదుగురు టపాసులు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మరొకరు కొన్ని అనివార్య కారణాల వల్ల దుకాణం ఏర్పాటు చేయలేదు. ఇంకొకరు నిబంధనలకు విరుద్ధంగా గుట్టూరులో రేకుల షెడ్డులో టపాసులు అమ్మకాలు చేపట్టారు. రెవెనూ , పోలీస్, అగ్నిమాపక అధికారులు విక్రయ దారుడుకి ఉత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. అనుమతులు పెనుకొండలో ఇచ్చిఉండే గుట్టూరులో ఎలా అమ్ముతారు అని పలువురు చర్చించుకుంటున్నారు. ఆరు బయలు ఉన్న చోట తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేసి టపాసులు అమ్మకాలు చేయాలి. టపాసుల దుకాణాల వద్ద డ్రమ్ములలో నీళ్లు, ఒక బండి ఇసుక, రెండు ఫైర్ సేఫ్టీ సిలిండర్స్ ఉంచాలి. గుట్టూరులో ఏర్పాటు చేసిన టపాసుల కేంద్రం వద్ద శాశ్వత రేకుల షెడ్డులో టపాసులు అమ్ముతూ చిన్న బకెట్‌లో నీళ్లు ఉంచి ఇష్టారాజ్యంగా టపాసులు విక్రయిస్తున్నారు. విక్రయ కేంద్రంలోని పెద్ద పెద్ద బాక్సుల టపాకులు గోడౌన్ లాగా ఉపయోగిస్తున్నారు. నిబంధనలు పాటించని టపాసుల దుకాణదారునిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తునానరు. ఇలా నిబంధనలకు విరుద్దంగా అనుమతులు ఒకచోట తీసుకొని మరో చోట అమ్మకాలు చేపట్టడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు అనుమానాలు వ్యక్తం చేసైఉన్నారు. అనుమతులు ఇచ్చే సమయంలో రెవెన్యూ పోలీస్ అగ్నిమాపక అధికారులు తప్పనిసరిగా టపాసులు విక్రయ కేంద్రాల స్థలాలను పరిశీలించారు. అధికారుల పరిశ్రలన చేయకుండానే అనుమతులు మంజూరు చేయడం విడ్డూరంగా ఉ ందని పలువురు చర్చించుకుంటున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రాణనష్టం అధికంగా ఉండే అవకాశం ఉందంటూ పలువురు స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న టపాసులు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలంటూ పలువురు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఇష్టారాజ్యంగా ధరలు పెంచి బాణాసంచా విక్రయాలు..!

**- పట్టించుకునేవారే లేరని అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త



ఉరవకొండలోని ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలు

నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో లైసెన్సుదారులు ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాల్లో వా ్యపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి బాణాసంచా విక్రయిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. లైసెన్సు పొందిన వ్యాపారులు 8 మంది మేము చెప్పిందే ధర మీకు ఇష్టముంటే కొనండి అంటూ ఖరాఖండీగా చెబుతూ వేల రూపాయల బాణాసంచా కొన్నా కనీసం బిల్లులు కూడా ఇవ్వడంలేదని కొనగోలుదారులు వాపోతున్నారు. దుకాణాల వద్ద నిబంధనలు కూడా అంతంతమాత్రంగానే అమలు జరుగుతున్నాయని విమర్శిస్తున్నారు. ఇదివరకటితో పోల్చితే దుకాణాల వద్ద పరిస్థితి మెరుగుపడినా వ్యాపారులు బాణాసంచా ధరలను అడిగేవారు లేరన్నట్టు 10 రూపాయలు విలువచేసే బాణాసంచాను 100 రూపాయలకు విక్రయించి అందిన కాడికి దోచేస్తున్నారని వాపోతున్నారు. ఒక్కో వ్యాపారి 10,000 రూపాయలు పెట్టుబడి పెట్టి దాదాపు లక్ష రూపాయల వరకు సంపాదించుకొంటున్నారంటే ఈ వ్యాపారం ఎంత లాభదాయకంగా కొనసాగుతోందో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. కొన్ని దుకాణాల్లో నాశిరకం బాణాసంచా అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయని విమర్శిస్తునా న్నరు. ఎప్పుడో రెండు మూడు సంవత్సరాల క్రితం తయారు చేసిన నాశిరకం బాణాసంచా తెచ్చి కొందరు విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారని వాపోతున్నారు. దుకాణాలవద్ద ఎక్కడా ధరల పట్టిన ప్రదర్శించిన దాఖలాలే లేకపోవడంతో ఒక్కో దుకాణంలో ఒక్కో ఐటెమ్‌కు ఒక్కో ధర వసూళు చేస్తున్నారని వాపోతున్నారు. బాణాసంచా ధరల నియంత్రణపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# బాణసంచా దుకాణాల తనిఖీ

గుత్తి, నవంబర్ 11 ప్రభాతవార్త



టపాసుల దుకాణాలను పరిశీలిస్తున్న దృశ్యం

దీపావళిని పురస్కరించుకుని స్థానిక ఎంఎస్ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన బాణ సంచా దుకాణాలను శనివారం అగ్నిమాపకశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 13 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఫైర్‌స్టేషన్ అధికారి ఈశ్వర్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దుకాణాల వద్ద ఇసుక, నీరు నిల్వ వుంచుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మౌలానా అబుల్‌కలాం జయంతి వేడుకలు

గుత్తి, నవంబర్ 11 ప్రభాతవార్త :



మౌలానాకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పట్టణంలో శనివారం జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి వేడులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పెన్షనర్ల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అబూబకర్, రామో మ్మహన్, జెన్నే కుళ్లాయిబాబు, వెంకటేష్, స్వామిదాస్, శకుంతల, కృష్ణవేణి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గడినాడు ఆంధ్ర ప్రాంత విద్యాభివృద్ధికి కృషి

**- గడి నాడు కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు అంజన్ కుమార్**

అమరాపురం,నవంబర్ 11,ప్రభాతవార్త:



మాట్లాడుతున్న అధ్యక్షుడు దృశ్యం



సీనియర్ న్యాయవాదికి సన్మానం దృశ్యం

మండల పరిధిలోని ఆగ్రహారం గ్రామం నందు కన్నడ సాహిత్య పరిషత్ ఆంధ్ర ప్రదేశ్ గడినాడు సమితి సమావేశం గడినాడు కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు న్యాయవాది అంజన్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ఎంపిపి రాధకృష్ణ ఇంటి ఆవరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా సర్పంచ్ ధనుంజయ, కన్నడ సాహిత్య పరిషత్ కార్యదర్శి నిరంజన్,సాహిత్య పరిషత్ సంచాలకులు జయశంకర్,ఆరోగ్య సంచాలకులు తిప్పేస్వామి,రిటైర్ట్ ప్రొఫెసర్ మురుగేంద్రప్ప,యువ నాయకుడు నవీన్,మాజి సాహిత్య పరిషత్ కార్యదర్శి జయదేవ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ మనె అంగడళదల్లి-నుడిసిరి,నడె ఆరోగ్యద కడే అనే కార్యక్రమాలను నిర్వహించడం పైన వివరించారు.ముఖ్యంగ గడి నాడు ఆంధ్ర ప్రాంతాల అభివృద్ధికి కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు. విద్యను ప్రోత్సహించడంతో పాటు గడి ప్రాంతాలలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. యువతి,యువకులకు ఉపాధి కల్పించడానికి కృషి చేస్తామన్నారు.గడి ప్రాంతాలుగా ఆంధ్రప్రదేశ్‌లో మడకశిర,కళ్యాణదుర్గం,రాయదుర్గం,ఆదోని ప్రాంతాలలో గడినాడు కన్నడ పరిషత్ ఆంధ్ర విభాగం ఆధ్వర్యంలో ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికే కర్ణాటక ముఖ్య మంత్రి సిద్దరామయ్యకు వినతి అందజేశామని,అదేవిధంగా ఆంధ్ర ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డికి కూడా వినతి అందజేయడానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.కన్నడ సాహిత్య పరిషత్ నడె ఆరోగ్య సంచాలకులు వలస తిప్పేస్వామి ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన మెలకవలను ప్రజలకు వివరించారు.సీనియర్ న్యాయవాది మడకశిర ప్రాంతంలో ఉన్న గడి నాడు అభివృద్ధికి కృషి చేసిన మెలవాయి గోవిందరెడ్డిని గడి నాడు ఆంధ్ర అధ్యక్షుడు అంజన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు.అదేవిధంగా మన అంగళ దల్లి నుడిసిరి కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపిపి రాధాకృష్ణ దంపతులకు గడినాడు కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం నందు గడి నాడు కన్నడ ఆంధ్ర విభాగపు బృందం జయశంకర్,నిరంజన్,డాక్టర్ తిప్పేస్వామి,జయదేవ్ మేర్తి తదితరులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రశ్నించే పత్రికల వారధులపైనే ఎమ్మెల్యే తిప్పేస్వామి ఎక్కుపెడతారా..?

**- ఎమ్మెల్యే తిప్పేస్వామి తీరుపై మండి పడ్డ తెలుగు తమ్ముళ్లు**

మడకశిర టౌన్, నవంబర్ 11 ప్రభాతవార్త



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

అవినీతి రహిత సమ సమాజం కోసం, ప్రజా స్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంబంలా ఉంటువస్తూ నిరంతరం అలుపెరుగకుండా పత్రికా విధులకే అకుంఠిత దీక్షతో అంకితమైన నిశ్వార్థంగా విధులు నిర్వహిస్తున్న పత్రికా ప్రతినిధులపైనే శాసనసభ్యులు తిప్పేస్వామి అనుసరిస్తున్న తీరుపై తెలుగు తమ్ముళ్లు తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. శనివారం బాలాజీ నగర్‌లోని తేదేపా కార్యాలయంలో తమ్ముళ్లు పత్రికా సమావేశం నిర్వహించి మీడియా ప్రతినిధులపై పాలక నేతలు అనుసరిస్తున్న విధానాలపై విరుచుకు పడ్డారు. భావా స్వేచ్ఛ కలిగిన మీడియా ప్రతినిధుల శ్రేయస్సు దృష్ట్యా వారికి ఇబ్బందులు కలిగించే వారు ఎవరైనా ఎంతటి వారైనా ఎదుర్కొని అండగా నిలిచి మీడియా మిత్రులకు సంపూర్ణ సహకారం అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వారి అనుచరులు ఇరువురు తీరు మూలానా బాధిత వాలెంటీర్ గోడు వెళ్లబోసుకున్న తీరును నైతిక బాధ్యతతో విలేకరులు పత్రికల్లో ప్రచురించి, ప్రసార మాద్యమాల్లో ప్రసారం చేస్తే జీర్ణించుకోలేక ఎమ్మెల్యే, వారి అనుచరులు విలేకరులపైన కేసు కట్టించే యత్నంకు పాల్పడటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పాలకుల తీరుతో విలేకరులు వారి వృత్తిని కూడా చేసుకోవడానికి స్వేచ్ఛ కూడా లేకుండా పోతోందని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి చేస్తున్న అక్రమాలను, దందాలు, వసూళ్లపై ప్రజలకు వివరించడంలో పత్రికా విలేకరుల పాత్ర అమోఘం అన్నారు. ఇలాంటి విలేకర్లుపై కేసులు కట్టించడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. ముఖ ్యంగా విలేకరి రామాంజినేయులు, లక్ష్మీపతిలు ఎమ్మెల్యే చేస్తున్న అక్రమాలను ప్రజలకు వివరించడంతో ఉద్దేశ్య పూర్వకంగా వీరిపైన కేసు కట్టే యత్నంకు పాల్పడడం భావ్యం కాదన్నారు. విలేకరులు వాస్తవాలు వివరించడంతో వారిపై చాలా ఇబ్బందులకు గురి చేస్తుండడం ఖండిస్తున్నామన్నారు. తాను చేస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలు ప్రజలకు తెలియకూడదనే ఉద్దేశ్యంతోనే ఇలాంటి దిగజారుడుకు దిగారని ఆరోపించారు. స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడం కోసం విలేకరులకు తెలుగుదేశం పార్టీ మద్దతుగా నిలబడి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మడకశిర పట్టణ అధ్యక్షులు మనోహర్, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగేగౌడ్, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు పట్టం కడితేనే

**- రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు**

రామగిరి, నవంబర్ 11 ప్రభాతవార్త

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు పట్టం కడితేనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మ ండలంలోని కొండాపురం పంచాయితీ రెడ్డివారిపల్లి, నసనకోట గ్రామంలో టీడీపీ నాయకులు బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. టిడిపి అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని అన్ని పథకాలను తప్పకుండా అమలు చేయడం జరుగుతుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో ఈ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేసిందని మండిపడ్డారు. నాలుగున్నర ఏళ్ల పాలన అంతా అరాచకానికే సరిపోయిందని అభివృద్ధి మచ్చుకైనా కనిపించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రామ్మూర్తి నాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, తెలుగు యువత మండల అధ్యక్షులు శ్రీధర్‌నాయుడు, నాయకులు పెద్దిరెడ్డి, అంజన్‌రెడ్డి, రవి, జయచంద్ర పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

# సత్యసాయి అవతార ప్రకటన క్షేత్రంలో మొదలైన అఖండ భజన

**- ప్రపంచ శాంతికై సత్యసాయి 98వ జయంతోత్సవంలో భాగంగా నిర్వహణ**

ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త



సత్యసాయి, షిరిడి సాయి చిత్రపటాలను ప్రత్యేకంగా ముస్తాబు చేసిన దృశ్యం

పట్టణంలోని సత్యసాయి అవతార ప్రకటన క్షేత్రమైన బాలసాయి శిలా భజన మందిరంలో ప్రపంచ శాంతి, సత్యసాయి 98వ జయంతోత్సవాలను పురస్కరించుకొని శనివారం సాయంత్రం 6 గంటలకు అఖండ భజన కార్యక్రమం ప్రారంభమైంది. తొలుత భజన మందిరంలోని సత్యసాయి, షిరిడిసాయి చిత్రపటాలను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భజన కార్యక్రమంను ప్రారంభించారు. ఉరవకొండతోపాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు భజనలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దాశెట్టి రామాంజినేయులు మాట్లాడుతూ అఖండ భజన ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందన్నారు. భజన ముగింపు సందర్భంగా సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తామన్నారు.

# దోమల నివారణపై అవగాహన కార్యక్రమాలు

ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త



మురుగునీటి కాలువల్లో అబేట్ ద్రావణాన్ని పిచికారి చేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో శనివారం దోమల నివారణపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి కె.ఎం.బాషా, మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, రాకెట్ల పీహెచ్‌సీ సీహెచ్‌ఓ నాగరంగయ్య, సూపర్‌వైజర్ శేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ భవానితో కూడిన బృందం ఇంటింటికీ వెళ్లి దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్య, మెదడువాపు, బోధకాల వ్యాధులు వస్తాయని వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించే కరపత్రాలను పంపిణీచేశారు. వాతావరణంలో మార్పులకారణంగా గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నీటి నిలువ ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి, మురుగునీటి కాలువల్లో అబేట్ మందును పిచికారి చేయించారు. సాయంత్రంపూట ఇళ్లలో వేపాకు పొగ వేసుకోవాలని, దోమ తెరలు వినియోగించాలని సూచించి సాయంత్రం ఫాగింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

**- మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ఘన నివాళి**

ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమావేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కె.అశ్రాఫ్ అలీ సిబ్బంది

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామం లోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ కె.అశ్రాఫ్ అలీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.అశ్రాఫ్ అలీతోపాటు ట్రిపుల్ యియియి విభాగాధిపతి వై.సురేష్‌బాబు మాట్లాడుతూ దేశంలో విద్యారంగ అభివృద్ధి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషి అజరామరం అన్నారు. ప్రతి విద్యార్థి, అధ్యాపక బృందం కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యతనివ్వాలని, సృజనాత్మకతతో మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్షన్ అధిపతి అలీహాప్ హుస్సేన్, కళాశాల సిబ్బంది దివ్య, సుధాకర్, గోపాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# 15న జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయండి

ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త



ప్రజా రక్షణ భేరి పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలులేని అభివృద్ధి కోసం ఈనెల 15వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయా లని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఎన్.మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు ఎ.రంగారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణంలో శనివారం వారు ప్రజా రక్షణ భేరి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసమానతలులేని అభివృద్ధి కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ జాతాలు ముగింపు సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు ఇతర ముఖ్య నాయకులందరూ పాల్గొని ప్రసంగిస్తారన్నారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించి పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, విద్య, వైద్యాన్ని అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మికులకు స్వగ్రామంలోనే ఉపాధిహామీ పనులు కల్పించి పనికితగ్గ కూలీ ఇవ్వాలన్నారు. బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తిదారులు, చిన్న, సన్నకారు రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ స్థానిక నాయకులు సూర్యనారాయణ, నరసింహులు, శివశంకర్ పాల్గొన్నారు.

# సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణపై ఏఐఎస్‌ఎఫ్ ఆందోళన

ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త

సెలవు రోజుల్లోనూ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారంటూ పట్టణంలో మహేశ్వరి, వివేకానంద పాఠశాలల్లో శనివారం ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఆందోళన నిర్వహించారు. తరగతులకు హాజరైన విద్యార్థులను బయటకు పంపించి పాఠశాలలకు తాళాలు వేయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ ఉరవకొండ మండల అధ్యక్షుడు హరున్ రషీద్, నాయకులు సుదీర్, లోకేష్ మాట్లాడుతూ ఆయా పాఠశాలల యాజమాన్యాలు సెలవు రోజుల్లోనూ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిబంధనలకు విరుద్ధంగా తరగతులను నిర్వహిస్తున్నాయని మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

07ATP11_07ATP11.qxd 11-11-2023 PM 11:01 Page 1



# పోలీస్‌మార్క్‌తో సత్తా చాటుతున్న డిఎస్‌పి




- తాడిపత్రి సబ్‌డివిజన్‌లో విధులు కత్తిమీదసామే
- తాడిపత్రిలో పనిచేసేందుకు పోలీసు అధికారుల అనాసక్తి
- క్లిష్ట సమయంలో బాధ్యతలు చేపట్టిన డిఎస్‌పి గంగయ్య

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 11 ప్రభాతవార్త**

పోలీసు మార్క్‌తో తాడిపత్రి డిఎస్‌పి గంగయ్య తన సత్తా చాటుతున్నారు. తాడిపత్రి పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఎన్నో ఫ్యాక్షన్ గ్రామాలు వున్నాయి. రాయలసీమలో తాడిపత్రి ప్రాంతానికి ప్రత్యేక స్థానం వుందంటే అతిశయోక్తికాదు. తాడిపత్రి సబ్‌డివిజన్‌లో విధులు నిర్వహించాలంటే పోలీసులకు కత్తిమీదసామే. ఎందుకంటే తాడిపత్రి ప్రాంతంలో ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనన్నది అందరికి తెలిసిన విషయమే. అప్పుడప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉలిక్కిపడే సంఘటనలు తాడిపత్రి ప్రాంతంలో చోటు చేసుకుంటూ ప్రత్యేకతను చాటుకుంటోంది. ఇక్కడ అనాదిగా గమనిస్తే ఫ్యాక్షన్ హత్యలు, గొడవలు, ఆస్తుల దహనం వంటివాటికి తాడిపత్రి ప్రాచుర్యం పొందింది. అయితే అంతకు రెట్టింపులో తాడిపత్రి పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. అయితే గతం నుండి ఇక్కడి రాజకీయ నాయకులు తమ అధికారాన్ని చేతిలో పెట్టుకుని తాడిపత్రిని శాశిస్తూ పేరు పొందేలా చరిత్రలో నిలిచిపోయేందుకు ఆడుతున్న రాజకీయ క్రీనీడల ఫలితంగా తాడిపత్రి ప్రాంతంలో పోలీసులు విధులు నిర్వహించడమంటే కత్తిమీదసామే. అంతేకాకుండా ముఖ్యంగా నేరాలను అరికట్టడమే కాకుండా రాజకీయ నాయకుల కొమ్ము కాస్తే తప్ప మనుగడ సాగించుకోలేని పరిస్థితి ఒకవైపు అయితే మరోవైపు వారి వృత్తికి న్యాయం చేయలేని పరిస్థితి తాడిపత్రి ప్రాంతంలో ఇప్పటికే నెలకొని వుంది. ఇలాంటి తరుణంలో డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన గంగయ్య పోలీసుమార్క్‌తో తన సత్తా చాటుతూ విధులు నిర్వహిస్తున్నారు. తాడిపత్రి సబ్ డివిజన్ వ్యాప్తంగా నేరాలు అరికట్టడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలైన పేకాట, మట్కా, గుట్కా, జూదం, మద్యం విక్రయాలతో పాటు అక్రమ ఇసుక రవాణా, రేషన్ బియ్యం అక్రమ తరలింపు, తదితర వాటి నివారణకు ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తూ తనదైన ముద్ర వేసుకున్నారు. అంతేకాకుండా పోలీసులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. రాత్రి సమయాల్లో పోలీసు గస్తీ ఏర్పాటు చేస్తూ దొంగతనాల నివారణకు చర్యలు చేపట్టారు. ప్రజలకు అందుబాటులో వుంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ తనదైనశైలిలో ముందుకు సాగుతున్నారు డిఎస్‌పి గంగయ్య.

## ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

**యాడికి, నవంబర్ 11 ప్రభాతవార్త**



మౌలానా అబుల్ కలాం గురించి వివరిస్తున్న కరస్పాండెంట్ విశ్వనాథ్

మండల కేంద్రంలోని విజన్ ప్రైవేటు పాఠశాలలో శనివారం భారత తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాథ్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1888 నవంబర్ 11న జన్మించి స్వీయ విద్యాభ్యాసం చేశారన్నారు. అనంతరం ఆల్ హిలాల్ పత్రిక స్థాపించి ఎంతో మందిని స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేలా ప్రేరణ కల్పించే కథనాలు వ్రాశారని, ఆయన రచనలకు భయపడిన బ్రిటీష్ ప్రభుత్వం ఆ పత్రికను కలకత్తా నుండి బహిష్కరించారని, ఆయన హిందూ, ముస్లింల ఐక్యత కోసం పాటుపడ్డారన్నారు. మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ఆయనే మొదటి విద్యాశాఖామంత్రిగా ఎన్నికయ్యారన్నారు. భారత విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి అనేక కళాశాలలు, విశ్వ విద్యాలయాలు స్థాపించి ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్యను అందించడంలో విశేష కృషి చేశారని తెలిపారు. విద్యారంగంలో ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విజన్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టపాసుల విక్రయదారులు జాగ్రత్తలు వహించాలి



టపాసుల దుకాణాలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ సత్య

**కూడేరు, నవంబర్ 11 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన బాణాసంచా విక్రయ కేంద్రాలను ఎస్ఐ సత్యనారాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రతి షాపుకు మధ్యన దూరం ఉండాలన్నారు. అందుబాటులో ఇసుక, నీరు ఉంచుకోవాలన్నారు. ఎలాంటి అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్‌షార్ట్ సరూ క్యూట్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని, బాణాసంచా విక్రయ దుకాణా దారులు ప్రకాష్, వెంకటేష్, కుతగు సూచనలు తెలియజేశారు. పోలీసులకు సహకరించాలని ఎస్సై సత్యనారాయణ సూచించారు.

## మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

- ఎంపిపి నారాయణరెడ్డి

**కూడేరు, నవంబర్ 11 ప్రభాతవార్త**



కూడేరు మండల ప్రజలకు ఎంపిపి నారాయణరెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి పర్వదినం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన అభిలాషించారు. కూడేరు మండల ప్రజలు ప్రజా ప్రతినిధులు ఎంపిటిసిలు సర్పంచులకు మండల అధికారులకు అనధజకారులకు సచివాలయ వాలెంటీర్లకు, శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎంపిపి నారాయణరెడ్డి పేర్కొన్నారు.

## బాలల హక్కుల వారోత్సవాలను, అంతర్జాతీయ దత్తత మాసమును జయప్రదం చేద్దాం

- ఐసిడిఎస్ పిడి డాక్టర్ బి.ఎన్.శ్రీదేవి పిలుపు

**అనంతపురం న్యూటౌన్, నవంబర్ 11 ప్రభాతవార్త**

నవంబర్ 14 భారత ప్రథమ ప్రధాని శ్రీ వహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం బాలల దినో త్సవ వేడుకలు జరుపుకుంటామని ఆ వేడుకలు జయప్రదం చేయమని డాక్టర్ బిఎన్.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలలో భాగంగా అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ సమితి, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 వారు సంయుక్తంగా వివిధ కార్యక్రమాలను చేపట్టుటకు కార్యచరణను రూపొందించినారని తెలిపారు. అలాగే అంతర్జాతీయ దత్తత మాస వేడుకలను కూడా నిర్వహించాలని నిశ్చయించారు. ఇంకా బాల్య వివాహాల నిర్మూలనకు కూడా కృషి చేస్తాము అని తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా 14వ తారీఖున బాలల దినోత్సవాన్ని జరుపుతామని, 15వ తారీఖున ఆన్‌లైన్ సేఫ్టీ గురించి యువతకు, విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించుతామని, 16వ తేదిన బాల బాలికలకు వేరువేరు క్రీడాంశాలలో పోటీలను నిర్వహిస్తామని, 17వ తారీఖున వివిధ మండలాలలో యువతకు చిత్రలేఖనంలో పోటీలను, 18వ తారీఖున బాల బాలికల సంరక్షణ గురించి జిఆర్‌పిఆర్‌పిఎఫ్, ఇతర శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమాలను, 19వ తారీఖున మానవహారం, కాండిల్ లైట్ ర్యాలీ, 20వ తారీఖున అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం జరపనున్నట్లు ఈ వారోత్సవాలు జయప్రదం చేయాలని కోరారు.

## పశువుల వైద్యంలో నిర్లక్ష్యం

- హైవే రోడ్డు ఉంటేనే పశువులు వైద్యానికి వెళ్తాం

**కూడేరు, నవంబర్ 11 ప్రభాతవార్త**



మృతిచెందిన ఆవు

నియోజకవర్గం పరిధిలోని కూడేరు మండలంలో అత్యవసర పశువుల వైద్యం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పెట్టిన 1962 పశు సంచార వాహనంతో పాటు ప్రత్యేకమైన పశు వైద్య డాక్టర్లను ఏర్పాటు చేశారు. అలాగే రవాణా నిర్వహణ ఖర్చులు నిధులు, కూడా ప్రభుత్వం వాటికి ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాకుండా అత్యవసర పరిస్థితుల్లో పశువుల ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆయా గ్రామాల ప్రజలు రైతులు పశువుల వద్దకే వెళ్లి వైద్యం నిర్వహించాలి. కానీ పశువైద్య డాక్టర్లు మాత్రం కాలయాపన కోసం తూతూ మంత్రంగా వస్తూ వెళ్తూ ఉంటారు. కానీ పశువులకు మాత్రం వైద్యం చేసిన పాపన పోలేదని అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యంతో ఉన్న పశువులకు వైద్యం నిర్వహించకుండా మధ్యలోనే తిరిగి వెనక్కి వెళ్తున్నారని అనారోగ్యంతో ఉన్న పశువులను గొర్రెలను వైద్యం చేయాల్సిన డాక్టర్లు పశువులు అనారోగ్యంతో ఉన్న ఆ పశువులను మా దగ్గరికి వెంటబెట్టుకుని రావాలని మేము వచ్చే ప్రసక్తే లేదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని జయపురం గ్రామ రైతు ఎరికిల నారాయణస్వామి, ఆయుర్వేదం వ్యక్తం చేయడం జరిగింది. డాక్టర్ల నిర్లక్ష్యంతో సూలు అయిన మరణానికి డాక్టర్లు కారణమయ్యారని దాదాపు 30వేల రూపాయలు ఆవు మరణించినట్లు రైతు ఆవేదన చెందారు. పశు వైద్య డాక్టర్లపై జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా మండల వ్యాప్తంగా పలు గ్రామాల రైతులు కోరారు. గత నాలుగు రోజులుగా 1962లో కాల్ చేసిపవులకి ఆరోగ్య పరిస్థితి బాగాలేదు అని పశువుల రైతు ప్రాదేయపడిన స్పందించడం లేదని పశువులు సంబంధించిన స్థలానికి 1962 వాహనం వచ్చి పశులకు వైద్యం చేయకుండా అత్యవసర వాహనాన్ని వెనక్కి తిప్పుకొని వెళ్లి పోవడం వల్ల ఆవు పరిస్థితి విషమించి చనిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయండి

- పోస్టర్లను ఆవిష్కరించిన సిపియం నాయకులు



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న సిపియం పార్టీ నాయకులు

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 11, ప్రభాతవార్త**

ఈ నెల 15న విజయవాడలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజారక్షణ భేరి మహా ప్రదర్శన, బహిరంగ సభలను విజయవంతం చేయాలని సిపియం పార్టీ నాయకులు పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఆ పార్టీ సీనియర్ నాయకులు వివి రమణ, సిఐటియు మండల కార్యదర్శి శ్రీరాములు, అధ్యక్షుడు కుళ్లాయప్ప, దేవాన్ష్ తదితరులు గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపి ఓడించాలని, బిజెపికి కొమ్ముకాస్తున్న పార్టీలను వ్యతిరేకిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్బంధ విధానాలపై పోరాటం చేసే దిశగా వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐకమత్యంతో ప్రజారక్షణ భేరి నిర్వహిస్తున్నామన్నారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు బిఆర్‌టిఎస్ రోడ్డు నుండి మహాప్రదర్శన ప్రారంభమై అనంతరం 11 గంటలకు యంబి స్టేడియంలో ప్రజారక్షణ భేరి బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. సిపియం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపియం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. కావున ప్రజలు, వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రజారక్షణ భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## 15న ఏపిటిఎఫ్ ఛలో విజయవాడ

**అనంతపురం న్యూటౌన్, నవంబర్ 11 ప్రభాతవార్త**

అనంతపురం ఏపిటిఎఫ్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నవంబర్ 12న జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు ఆర్థికంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురి అవుతున్నరని రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ సమస్యల పట్ల స ఆచివేత ధోరణి అవలంభిస్తూ కనీసం పెద్ద ఎత్తున ఆందోళన చేసుకుని అవకాశాలు కూడా లేకుండా నాయకులను ఎక్కడికక్కడే నిర్బంధిస్తూ ఉద్యమాన్ని నీరుగారుస్తున్నారని గత నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి డిఏ కూడా చెల్లించలేదని 149 నెలల డిఏ బకాయిలను వెంటనే చెల్లించాలని 11వ పిఆర్‌సిలోని అనేక బకాయిలను చెల్లించకుండానే 12వ పిఆర్‌సి నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఇంత వరకు ఐఆర్ విషయం ఊసే లేదని ఈ విధంగా అనేక రకాలుగా సుమారు 30 వేల కోట్లు పైబడి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందని విద్యారంగం పట్ల తీరు నష్టాన్ని కలిగిస్తున్న జీవో నెంబర్ 117ను రద్దు చేసి గ్రామీణ విద్యాభివృద్ధికి పాటుపడాలని ఇంటీరియర్ రిలీఫ్‌ను వెంటనే ప్రకటించాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు రాయల్ వ ఎంకటేష్ ఎస్‌సి రాజుద్దీన్, గౌరవ సలహాదారు బి.వెంకటేషులు, జిల్లా ఉపాధ్యక్షులు డేనియల్ నాగరాజు బొమ్మయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు, సర్దార్ వలి, సతీష్‌కుమార్, జిల్లా నాయకులు చిదంబరెడ్డి, పి.రవి, తిప్పేస్వామి, శ్రీనివాసులు, సంగప్ప, ప్రసాద్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎమ్మెల్యే దీపావళి శుభాకాంక్షలు

**కదిరి, నవంబర్ 11 ప్రభాతవార్త**



కదిరి నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి శనివారం దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిపై వెలుగు చెడుపై మంచి అజ్ఞానంపై జ్ఞానం దుష్ట శక్తులపై దైవ శక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ ప్రజలందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని ఆకాంక్షించారు. ఈ పర్వదినం సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని దివ్వెల వెలుగులలో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో విరాజిల్లాలని ఎమ్మెల్యే అభిలాషించారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



వెంకటనారాయణను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

**కదిరి, నవంబర్ 11 ప్రభాతవార్త**

కదిరి మున్సిపల్ పరిధిలోని ఖాద్రి ఉన్నత పాఠశాల 2010-11 సంవత్సరం పూర్వపు విద్యార్థులు అపూర్వ కలయికను శనివారం నిర్వహించారు. కదిరి రూరల్ మండలంలోని కాల సముద్రం ఫ్యూరెస్ట్ గెస్ట్ హౌస్‌లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎ.వెంకటనారాయణరెడ్డి, ఎ.ఎం.రాజేంద్ర, ఉపాధ్యాయులను పూర్వపు విద్యార్థిని విద్యార్థులు పూల మాలలతో, దుశ్శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం గురువులతో కలిసి విద్యార్థులు భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 11, ప్రభాతవార్త**

మండల కేంద్రంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గ్రామ సచివాలయం వద్ద శనివారం పంచాయితీ సర్పంచ్ ముద్దలపల్లి గోవిందు, పంచాయితీ కార్యదర్శి రామలింగారెడ్డిలు యూనిఫార్మ్స్ పంపిణీ చేశారు. పగడాలవారిపల్లికి చెందిన రెడ్డిపల్లి శ్యాంప్రసాద్‌రెడ్డి యూనిఫాంలను ఉచితంగా అందచేసి తన ఉదారతను చాటుకున్నాడని సర్పంచ్ గోవిందు ఈ సందర్భంగా తెలియచేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

## తంగేడుకుంట పంచాయితీకి మహర్ధశ

- రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 11, ప్రభాతవార్త**

మండల పరిధిలోని తంగేడుకుంట పంచాయితీకి మహర్ధశ వరించినట్లు సర్పంచ్ అబీదాభాను పేర్కొన్నారు. సర్పంచ్ అభిదాభాను, ఎంపిటిసి రమణయ్య, వైసిపి నాయకులు భారతి సిమెంట్ రఫీలు శనివారం తంగేడుకుంటలో రూ కోటి 74 లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులకు పూజా కార్య క్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పుట్టపర్తి శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పంచాయితీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజిఎస్ నిధులతో సిమె ంట్ రోడ్లు వేయనున్నామన్నారు. అంతే కాకుండా గ్రామాల్లో మౌళిక వసతులు వీధిలైట్లు ఏర్పాటు, తాగునీరు, డ్రైనేజి సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆమె తెలిపారు. సిమెంట్ రోడ్డు మంజూరుకు కృషి చేసిన వైసిపి నాయకులు ఎంపిటిసి రమణయ్య, రఫీకి గ్రామస్తులు, వైసిపి నాయకుల ఆధ్వర్యంలో శాలువలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

## 14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

**పుట్టపర్తిటౌన్, నవంబర్ 11, ప్రభాతవార్త**

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14వ తేది నుండి 20వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎ.ఆంజనేయులు తెలిపారు. శనివారం గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించి పోస్టర్లను, కరపత్రాలను మున్సిపల్ ఛైర్మన్ తుంగా ఓబుళపతి ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఆయనచిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు.

అనంతరం గ్రంథాలయ శాఖ అధికారి మాట్లాడుతూ, అక్షర సమాజం పుట్టిన రోజు నుండి గ్రంథాలయ జీవన వికాసానికి, సామాజిక పురోగతికి సోపానాలుగా గ్రంథాలయాలు నిలుస్తున్నాయని, గ్రంథాలయాలు అందిస్తున్న సేవలు ప్రజలకు తెలియజేయడం నేటి తరాలకు గ్రంథాలయాల అవసరం గురించి తెలియజేస్తూ ఈ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతందన్నారు. ఈ కార్యక్రమానికి పాఠకులు, విద్యావేత్తలు, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు రామాంజినేయులు, ఉపాధ్యాయులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

Read & Advertise in Vaartha

## పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వంచే త్వరలో పరిహారం

- హాళకుంది, మించేరి, సంజీవరాయనకోట గ్రామాల్లో మంత్రి నాగేంద్రచే పంటలవీక్షణ



హాళకుంది, మించేరీ గ్రామాల్లో వర్షాలు లేక ఎండిన పంటలను పరిశీలిస్తున్న జిల్లా మంత్రి నాగేంద్ర

**బళ్లారి, నవంబర్11, ప్రభాతవార్త**

తీవ్ర వర్షాభావం కారణంగా పంటలు కోల్పోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పరిహారం అందజేస్తుందని, ఈ నేపథ్యంలో రైతులు తమ పంటలకు సంబంధించి క్షేత్ర పరిశీలన జరిపే వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులకు పంటనష్టం అంచనాకు సంబంధించి వివరాలు తెలియజెప్పాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బి.నాగేంద్ర రైతులకు తెలిపారు. బళ్లారి తాలూకాలోని హాళకుంది, మించేరీ, సంజీవరాయనకోట తదితర గ్రామాల్లో జిల్లాస్థాయి అధికారుల బృందంతో కలిసి శనివారంనాడు పంటల పరిశీలన జరిపారు. సదరు గ్రామాల్లో రైతులు ఎక్కువగా కంది, మొక్కజొన్న, సజ్జ, రాగి తదితర పంటలు సాగుచేయగా వర్షాలు రాకపోవడంతో పంటలు కాస్త ఎండి నేలవాలిపోయిన దృశ్యం కనిపించి విస్తుపోయారు. మంత్రి వద్దకు వచ్చిన రైతులు లక్షలాది రూపాయలు వెచ్చించి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి పంటలు వేసుకున్నామని, తీరా చూస్తే ఇలా పంటలు చేతికి రాకుండా పోయాయని వాపోయారు. జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మల్లికార్జున మంత్రి నాగేంద్రతో మాట్లాడుతూ బళ్లారి జిల్లాలో సుమారు 68 వేల హెక్టార్ల ప్రాంతంలో పంట నష్టం జరిగింది. మిరప, పత్తి, సజ్జ, సూర్యకాంతి తదితర పంటలు రైతులు సాగుచేశారని, ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు మొండిచేయి చూపడంతో పంటలు కాస్త ఎండిపోయాయని, కురిసిన కొద్దిపాటి వర్షానికి అక్కడక్కడ రైతుల పంటలకు మచ్చ తెగులు సోకి అవి కూడా ఎండిపోయినట్లు చెప్పారు. ఇప్పటికే ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సందర్శించి పరిశీలన జరిపినట్లు అధికారి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి హెక్టార్‌కు రూ.8 వేలు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని, పరిహారం పంపిణీలో వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. పంటలకు ఇన్సూరెన్స్ చేయించినట్లు, నష్టపోయిన పంటలకు బీమా చెల్లించాలని పలువురు రైతులు ఈ సందర్భంలో మంత్రికి తెలపగా, దీనిపై పరిశీలన జరిపి తక్షణం చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంలో జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్‌శరణప్ప సంకనూరు, ఏడీసీ మహ్మద్‌జుబేరా, తహసీల్దార్ గురురాజ్, జిల్లా, తాలూకాస్థాయి అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలి

- జిల్లా నూతన కోర్టులో న్యాయవాదుల బార్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి ప్రసన్నవరాలే





బళ్లారి కోర్టులో న్యాయవాదుల సంఘం నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి ప్రసన్నవరాలే. చిత్రంలో రాష్ట్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్.కె.పాటిల్‌లు ఉన్నారు.

**బళ్లారి, నవంబర్11, ప్రభాతవార్త**

జిల్లా న్యాయశాఖ, పీడబ్ల్యూడీశాఖ, న్యాయవాదుల సంఘంల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని తాళూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన బళ్లారి న్యాయవాదుల సంఘం నూతన భవన సముదాయాన్ని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు ముఖ్య న్యాయమూర్తి ప్రసన్నవరాలే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంలో మాట్లాడిన ఆయన కేసుల సత్వర పరిష్కారానికి న్యాయమూర్తులు సహకరించాలని, దీర్ఘకాలంగా విచారణలో ఉన్న కేసుల్ని ముందుగా పరిష్కరించే దిశలో చర్యలు తీసుకోవాలని కక్షిదారులకు, సామాన్యులకు న్యాయం కల్పించే దిశలో న్యాయవాదులు కార్యం నిర్వహించాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర, గోవా న్యాయవాదుల సంఘాల మాదిరిగా బళ్లారిలోనూ బార్ అసోసియేషన్ కార్యం నిర్వహించాలి, అందుకు అవసరమైన సౌలభ్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాలు, పర్యాటకశాఖ మంత్రి హెచ్.కె.పాటిల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామ పోరాటంలో, కర్ణాటక ఏకీకరణ ఉద్యమంలో బళ్లారి కోర్టులో విధులు నిర్వహించిన న్యాయవాదుల పాత్ర మహత్తరమైనదని, ఆ సమయంలో వారు పోషించిన పాత్ర, తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమైనవని, ఎంతో కీర్తి ప్రతిష్టలు కలిగి చారిత్రక నేపథ్యం ఉన్న ఘనత బళ్లారి కోర్టుకు చెందుతుందని ప్రశంసించారు. సమాజం అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నది, అయితే కేసులు అధికంగా ఉన్న చోట అభివృద్ధి కుంటుపడుతున్నది, కావునా మన ప్రభుత్వం వ్యాజ్యరహిత గ్రామాల నిర్మాణానికి చింతన జరుపుతున్నది. అయితే న్యాయవాదులు ఈ కార్యానికి చేతులు కలపాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. న్యాయం కోరి వచ్చే జన సామాన్యులకు న్యాయ స్థానాల్లో రాజ్యాంగబద్ధమైన గౌరవం దక్కాల్సి ఉన్నదని, నేటి రోజుల్లో ఆ కొరత కనిపిస్తున్నదని, కక్షిదారుల గౌరవం కాపాడడం కోసం చట్టరీత్యా ఒక విధానాన్ని జారీలోకి తీసుకొచ్చే యోచన ఉన్నదని చెప్పారు. ప్రజల ఇంటి వద్దకు న్యాయదానం కల్పించే నేపథ్యంలో గ్రామ న్యాయాలయాల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని, 2008లో ఈ చట్టం జారీలోకి వచ్చింది. ఇటీవలే తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో దీనిపై ఆసక్తి వహిస్తున్నదని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని, కేసుల్ని తగ్గించే నేపథ్యంలో చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్ అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి అశోక్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ 58 ఎకరాల ప్రాంతంలో విశాలమైన జిల్లా కోర్టు కాంప్లెక్స్ భవనం అనేక సౌలభ్యాలు కలిగి ఉన్నదని, కొద్దిపాటి పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నుంచి అదనంగా రూ.21 కోట్లు నిధులు రావాల్సి ఉన్నదని చెప్పారు. ఈ సందర్భంలో జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.ఎర్రిగౌడ, రాష్ట్ర హైకోర్టుకు చెందిన కె.ఎస్.భరత్‌కుమార్, రాష్ట్ర వకీల్ పరిషత్ మాజీ అధ్యక్షుడు జె.ఎం.అనిల్‌కుమార్, కె.కోటేశ్వరరావు, జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.హెచ్.పుష్పాంజలిదేవి, జిల్లా న్యాయవాదులసంఘం కార్యదర్శి బి.రవీంద్రనాథ్ తదితర అధికారులు, ఆయా కోర్టుల న్యాయమూర్తులు పాల్గొన్నారు.

